క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తుని: లోవకొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25కు విద్యా సంవత్సరానికి సంబంధించి వచ్చే నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని గురుకుల పాఠశాలల్లో ఎస్సీలు 75 శాతం, బీసీ సి (కన్వర్ట్ క్రిస్టియన్స్)కు 12 శాతం, ఎస్టీ 6 శాతం, బీసీ 5 శాతం, ఇతరులకు 2 శాతం సీట్లు కేటాయించారన్నారు. రూ.లక్ష లోపు వార్షిక ఆదాయం ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 10న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు.

అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం సామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎస్సై సతీష్‌కు సత్కారం



ఎస్సై సతీష్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఏలేశ్వరం: రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న స్థానిక ఎస్సై సతీష్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై సతీష్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్సై సతీష్ ఉత్తమ సేవలకు గాను అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇటువంటి అవార్డులు మరిన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు అనసూరి నాగేశ్వరరావు, ఏడీవీ ప్రసాద్, కప్పల నాగభూషణం, ఊరా రాజబాబు, కందుల ప్రభాకర్ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ప్రయాణికులకు అవగాహన



గండేపల్లిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, హైవే సిబ్బంది

గండేపల్లి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక జాతీయ రహదారిపై వాహనదారులు, ప్రయాణికులకు సోమవారం పోలీసులు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. పలు ద్విచక్ర వాహనాలకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ అసిస్టెంట్ మేనేజర్ వి.ధనకుమార్, సిబ్బంది, గండేపల్లి పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గండేపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన నక్కా భవాని ప్రసాద్ (34) ఇటీవల అప్పు చేసి జేసీబీ కొనుగోలు చేశాడు. అప్పు తీర్చలేకపోవడంతో మనస్తాపంతో చెంది ఈ నెల 27న పొలంలో పురుగు మందు తాగాడు. అతడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం

- మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- పలు గ్రామాల్లో పర్యటన



గండేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం



తోట నరసింహాన్ని సత్కరిస్తున్న గోకవరం వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని జగపతినగరంలో వైఎస్సార్ సీపీ నేత దాడి చిన్నబుజ్జి ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రజలకు విద్య, వైద్యం అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ, పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, సరిసే రామాలియ్య, శరకణం శ్రీను, యల్లపు చంటి, బుద్ధ మంగరాజు, సైతిని అచ్చారావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సిద్ధం' సభకు తరలిరావాలి

గండేపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరులో వచ్చే నెల 1న నిర్వహించ తలపెట్టిన సిద్ధం బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పిలుపునిచ్చారు. గండేపల్లిలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో సోమవారం ఆయన వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం పార్టీ నేతలు తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీలను పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గ్రామ సర్పంచ్ రుత్తల లలిత, పార్టీ నాయకులు అత్తులూరి సాయిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, పార్టీ నాయకులు తొండాపు రమణారెడ్డి, కుంచె చినబాబు, పరిమి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'తోట'ను కలసిన దళిత నాయకులు

గోకవరం: వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ తోట నరసింహాన్ని గోకవరం మండల వైఎస్సార్ సీపీ దళిత నాయకులు సోమవారం కిర్లంపూడి మండలం వీరవరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు బిజ్జి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చా మోహన్, టౌన్ అధ్యక్షుడు మందపాటి సతీష్‌కుమార్, మచ్చా మురళీ, గోలి చిన్ని, సోషల్ మీడియా కన్వీనర్ అంబటి ప్రసన్న తదితరులు తోట నరసింహాన్ని కలిశారు. పూలమాల, శాలువాతో ఆయనను సత్కరించారు. ఫిబ్రవరి 3న జరిగే సిద్ధం బహిరంగ సభకు తామంతా సిద్ధమని, సభ విజయవంతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆకాశ సన్నీ, తాలాటి నాగేంద్రుడు, రూపం వాడపల్లి, అంబటి శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూలుకు ప్రత్యేక కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: ఇంటి పన్ను వసూలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటిపన్ను వసూలుపై సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబకాయిలు రూ.13.17 లక్షలు ఉండగా కొత్తబకాయిలు రూ.56.6 లక్షలు వెరసి మొత్తం రూ.69.8 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రూ. 29 లక్షలు (42) పన్ను బకాయిలు వసూలయ్యాయని తెలిపారు. జనవరి నెలాఖరు నాటికి 50 శాతం, ఫిబ్రవరి నెలాఖరు నాటికి 100 పన్నులు వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజానాగేశ్వరరావు, ఏవీ రమణ, పృథ్వి, భవానీ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు

ప్రత్తిపాడు: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో నిర్మించిన గృహాలకు పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు చేయాలని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన రూ.10 స్టాంపు పేపర్‌ను ప్రభుత్వమే సమకూరుస్తుందన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలోనే ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారుల ఇళ్లకు పక్కాగా రిజిస్ట్రేషన్లు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు కె.పుణ్యవతి, టి.శ్రీనివాసరావు, ఆర్.కల్యాణి, మండల సర్వేయర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో కోడి వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

కిర్లంపూడి: చేపల చెరువుల్లో కోడి వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తప్పవని మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ బి.రాజేంద్రరావు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఓ కేవీ మాధవరావు అధ్యక్షతన సోమవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలు చెరువుల్లో కోడి వ్యర్థాలు వేయడం వలన పరిసరాలు, నీరు కలుషితమవుతున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి.ఉమామహేశ్వరరావు, వీఆర్ఓలు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో జయహో బీసీ సదస్సు

ప్రత్తిపాడు: స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో సోమవారం సాయంత్రం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి యనమల కృష్ణుడు, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ ముఖ్య అతిథులు పాల్గొని మాట్లాడారు. బీసీలపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. బీసీల హక్కులను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు టీడీపీకి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం జయహో బీసీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పెరిక సాధికారిక సంఘ కన్వీనర్ వనపర్తి బద్రి, టీడీపీ నాయకులు పైలా సాంబశివరావు, ఒమ్మి బాలాజీ పాల్గొన్నారు.

జయహో బీసీ కార్యక్రమంపై సమీక్ష

ఏలేశ్వరం: బీసీల అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి అన్నారు. పట్టణంలో ఈ నెల 31న జరిగే జయహో బీసీ కార్యక్రమంపై సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ధనేకుల వీరభద్రరావు, వైభోగుల సుబ్బారావు, కోరాడకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



లింగంపర్తిలో వరుపులను గజమాలతో సత్కరిస్తున్న అన్నవరం వైఎస్సార్ సీపీ నాయకులు

- ఆ పార్టీ నియోజకర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో సోమవారం ఆయనను నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి సంఘీభావం తెలిపారు. అన్నవరం పార్టీ శ్రేణులు వరుపులను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయన్నారు. అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వీరంకి ఉదయ్, కొండపల్లి సూర్య, వారణాసి హర్ష, దడాల సతీష్, కొండపల్లి అప్పారావు, బొబ్బిలి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీఓకు ఉత్తమ సేవా పురస్కారం

ప్రత్తిపాడు: భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు కాకినాడలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా చేతుల మీదుగా సోమవారం ఆమె పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్నారు. అవార్డు పొందిన సీడీపీఓ లక్ష్మిని అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల సంఘం నాయకులు కాకరాపల్లి సునీత, లక్ష్మి, హేమలత, యాసలపు జ్యోతి, పద్మ తదితరులు అభినందించారు.





జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి, ఏవీనగరం పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్ అలేఖ్య

ఉత్తమ సేవా పురస్కారం గ్రహీతకు అభినందనలు

తొండంగి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏవీ నగరంలో పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తున్న ఎ.అలేఖ్య ఉత్తమ సేవా పురస్కారం అందుకుంది. కాగా సోమవారం పీహెచ్‌సీలో వైద్యాధికారులు పి.రవికుమార్, పి.భారతి ఇతర వైద్య సిబ్బంది ఆమెను అభినందించారు.

నష్ట పరిహారం అందించాలని వినతి



శంఖవరంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యానికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

శంఖవరం: మిచాన్ తుపాన్ కారణంగా పంట నష్టపోయిన తమకు నష్ట పరిహారం అందించి న్యాయం చేయాలని శంఖవరం గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యానికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి పంట నీట మునిగి కుళ్లిపోయిందన్నారు. ధాన్యం రాశులు కొట్టుకుపోయాలని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అధికారులు పంట నష్టపోయిన రైతులకు కాకుండా వేరే వారికి నష్ట పరిహారం వచ్చేలా జాబితా రూపొందించారని ఆరోపించారు. ఆయిల్ పామ్, సరుగుడు తోటలు ఉన్న రైతుల పేర్లను కూడా పంట నష్ట పరిహారం జాబితా చేర్చారన్నారు. దీనిపై స్థానిక వీఆర్వో, వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సర్వే చేసి సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. దీనిపై విచారణ జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు పడాల సతీష్, పర్వత రామకృష్ణ, రేలంగి సూరిబాబు, బొమ్మిడి చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి తీరుకు నిరసనగా ఆందోళన



ప్రత్తిపాడు ఎంపీడీఓ చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న చింతలూరు సర్పంచ్ గంగ, పాలకవర్గ సభ్యులు

ప్రత్తిపాడు: మండలంలోని చింతలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ హోదాలో సమావేశాలు నిర్వహించరాదని కార్యదర్శి హుకుం జారీ చేయడంపై ఆ గ్రామ సర్పంచ్ పంద్రాడ గంగ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి వైఖరికి వ్యతిరేకంగా ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చాంబర్ వద్ద సోమవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పంద్రాడ గంగ మాట్లాడుతూ ఈ నెల 27న ఉదయం 11 గంటలకు గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించుకునేందుకు నిర్ణయించామన్నారు. ఆ సమావేశానికి గ్రామ కార్యదర్శి అనుమతి నిరాకరించారన్నారు. అంతేగాక దళిత సర్పంచ్‌నైన తనను దూషించి అవమానించారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి కార్యదర్శిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ పంద్రాడ గంగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జె.శ్రీనివాసుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి మురళీ, పంచాయతీ పాలక వర్గ సభ్యుడు బి.సత్య, జి.అప్పలరాజు, పి.నాగవెంకట సత్యవేణి, జి.దేవి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గొల్లప్రోలు జట్టు



తలపంటిపేటలో క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

తొండంగి: సంక్రాంతి, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ తలపంటిపేటలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా గొల్లప్రోలు జట్టు నిలిచింది. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో తలపంటిపేట యువత ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 29 వరకూ నిర్వహించిన ఈ టోర్నీలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 80 జట్లు పాల్గొన్నాయి. తొండంగి మండలం ఎల్లయ్యపేట, గొల్లప్రోలు జట్ల సోమవారం హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గొల్లప్రోలు జట్టు విజేతగా నిలిచింది. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్, ఎస్సై వినయ్‌ప్రతాప్, యాదాల రాజబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, ఉప సర్పంచ్ పెరుమాళ్ల లోవరాజు, ఎంపీటీసీలు అంబుజాలపు అప్పలరాజు, తలపంటి వరహాలు, తలపంటిపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

గండేపల్లి: మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై ఎస్.రామకృష్ణ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని తాళ్లూరు శివారు న్యూసాయి ఫణీంద్ర దాబా వద్ద పాన్ షాపుపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 12 మద్యం సీసాలు, 4 బీర్ సీసాలను స్వాధీనం చేసుకుని షాపు నిర్వాహకురాలు జాస్తి రాజును అరెస్ట్ చేశారు.

ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- నియోజకవర్గస్థాయి ఆడుదాం–ఆంధ్రా విజేతలకు బహుమతుల ప్రదానం



జగ్గంపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం– ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలన్నారు. తాను కూడా కబడ్డీ క్రీడాకారుడిగా రాణించి రాష్ట్రస్థాయి టీమ్‌కు కెప్టెన్‌గా పని చేశానని తెలిపారు. క్రీడాకారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, యువ నేత తోట రాంజీ, ఎంపీపీఓ వసంతకుమార్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

జగ్గంపేట: సమాజంలో ఆడపిల్లలను రక్షించడం, వారిని చదివించడం ఎంతో ముఖ్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జాతీయ బాలికల వారోత్సవాల్లో భాగంగా జగ్గంపేట ప్రభుత్వోన్నత పాఠశాలలో సోమవారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో బాలికలకు డ్రాయింగ్, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. విజేతలకు తోట నరసింహం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, తోట రాంజీ, వైఎస్సార్ సీపీ నేతలు గఫూర్, జగాల్, తులా రాము, హైస్కూల్ హెచ్ఎం రంగా తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రక్షిత తాగునీరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



ప్రత్తిపాడులో గ్రామ జల సంఘ సభ్యులకు అవగాహన కల్పింస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీరామ్

ఏలేశ్వరం: ప్రతి గ్రామానికీ పూర్తి స్థాయిలో రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామీణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో గ్రామ జల సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. జలసంఘాల నేతృత్వంలో తాగునీటి కుళాయిలు, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కమిటీలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ముగ్గురు డ్వాక్రా సభ్యులు వెరసి ఐదుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.రాఘవేంద్ర, జేఈ కేవీ శ్రీరామ్, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి

ప్రత్తిపాడు: గ్రామాల్లో తాగునీటి వ్యవస్థపై గ్రామ జల సంఘాలు అవగాహన పెంచుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.రాఘవేంద్ర సూచించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జల జీవన్ మిషన్ ద్వారా కమ్యూనిటీ కాంట్రాక్ట్ సిస్టమ్‌పై గ్రామ జల సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాల్లో మంచి నీటి సరఫరాకు జల సంఘాల సభ్యులు బాధ్యత వహించాలన్నారు. గ్రామాల్లో మంచినీటి కుళాయిలు, పైపు లైన్ల నిర్వాహణపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కె శ్రీరామ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కె.కాశీవిశ్వనాథం, వైఎస్సార్ కాంతిపథం ఏపీఎం వై. వెంకట్, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పంచాయతీ ఈఈ కేవీవీ చౌదరి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జల్ జీవన్ మిషన్ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్లూఎస్ జేఈ తేజ పాల్గొన్నారు.

గంటన్నర ఆలస్యంగా సత్యదేవునికి అభిషేకం

- తీర్థపుబిందె విధులకు పరిచారకుడి గైర్హాజరు
- మూడు రోజుల తర్వాత వెలుగులోకి...

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో మూడు రోజుల క్రితం ఒక పరిచారకుడు తెల్లవారుజామున 'తీర్థపు బిందె ' విధులకు గైర్హాజరు అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెల్లవారుజామున ఆలయం తలుపులు తీసిన అర్చకులు స్వామివారికి అభిషేకం చేసేందుకు తీర్థపుబిందె తెచ్చే పరిచారకుని కోసం ఎంతసేపు ఎదురు చూసినా రాకపోవడంతో సుమారు గంటన్నర ఆలస్యంగా మరో పరిచారకునితో తీర్థపు బిందె తీసుకుని వచ్చి అభిషేకం చేశారు.

స్వామివారి ప్రధానాలయంలో పనిచేసే పరిచారకులు రోజుకొకరు తెల్లవారుజామున మూడు గంటలకు కనకదుర్గ ఆలయం వద్ద నుంచి తీర్థపు బిందె మేళతాళాల మధ్య ఊరేగింపుగా మెట్ల దారి వెంట స్వామివారి ఆలయానికి తీసుకురావాల్సి ఉంటుంది. గతంలో పంపానది నుంచి తెచ్చేవారు. అయితే అక్కడ రేవులో అపరిశుభ్రత నెలకొనడంతో కనకదుర్గ ఆలయం వద్ద గల కుళాయిలో పట్టి తీసుకువస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒమ్మంగిలో కలిసిన పూర్వ విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 25 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో శీలం భరతుడు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.